క్లుప్తంగా

139 మందికి వైద్య పరీక్షలు

కె.కోటపాడు : తప్పనిసరిగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రాధాన్యమివ్వాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారిణి నిర్మల అన్నారు. కె.సంతపాలెం గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 139 మందికి వైద్య పరీక్షలతో పాటు పాఠశాలలో 12 మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. రక్తహీనత సమస్య గల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తరువాత ఐరన్ మాత్రలను వేయాల్సిందిగా ఉపాధ్యాయులకు సూచించారు. ఏఎన్‌ఎం శ్రీదేవి, రమణ తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం కోసం విజ్ఞప్తి

రావికమతం: తుపాను కారణంగా పడిన వర్షాలకు కామునిగెడ్డ జలాశయంలో తాము పెంచుతున్న చేపలు కొట్టుకుపోయాయని, వలలు ధ్వంసమయ్యాయని ధర్మవరం గిరిజన మత్స్యకారులు తెలిపారు. ప్రభుత్వం, మత్స్యశాఖ అధికారులు స్పందించి తమకు నష్టపరిహారం చెల్లించాలని వారు శుక్రవారం కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన మత్స్యకారులు గోరా చిరంజీవి, పొట్టన్నదొర, రాముడు తదితరులు పాల్గొన్నారు.

కాయగూరల పంటలకు నష్టం జరగలేదు

మాడుగుల రూరల్: తుపాను కారణంగా కాయగూరల పంటలకు నష్టం జరగలేదని మండల ఉద్యానవన శాఖాధికారి వి.భాను పుష్పలీలావతి తెలిపారు. మండలంలో కాయగూరల పంటలను ఆమె శుక్రవారం పరిశీలించారు. శంకరం, తాటిపర్తి, వీరనారాయణం తదితర గ్రామాల్లో ఆమె సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టమాటా, వంగ, బీర తదితర పంటలకు ఎటువంటి నష్టం వాటిల్లలేదన్నారు. కాయగూరల పంట భూముల్లో ఉన్న నీటిని బయటకు పంపించి, సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

నష్టపోయిన రైతులందరికీ పరిహారం ఇవ్వాలి

చోడవరం రూరల్: తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం చెల్లించాలని అనకాపల్లి జిల్లా రైతుకూలీ సంఘం కోరింది. శుక్రవారం సంఘం జిల్లా విభాగం ప్రతినిధులు మండలంలోని రేవళ్ళు, అన్నవరం గ్రామాల్లోని నీటమునిగిన పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు, సహాయ కార్యదర్శి కిళ్ళి దేముడు, కార్మికసంఘం నాయకుడు అయితిరెడ్డి అప్పలనాయుడు, సంఘ సభ్య రైతులు లెక్కల వెంకటరమణ, వేచలపు ముత్యాలునాయుడు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు బియ్యం పంపిణీ



వీరవల్లిలో కూలీలకు బియ్యం అందజేస్తున్న సిబ్బంది

మాడుగుల రూరల్: తుపాను ప్రభావంతో మండలంలో ఐదు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని, ఈ బాధితులకు బియ్యం పంపిణీ చేశామని స్థానిక తహసీల్దార్ పి.వి.రత్నం తెలిపారు. మాడుగులలో రెండు, శంకరం, వీరనారాయణం, పోతనపూడి, గ్రామాల్లో ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యాన్ని ఆర్ఐలు నాగేశ్వరావు, వెంకటేశ్వర్లు, సిబ్బంది శుక్రవారం అందజేశారు. వీరితో పాటు వి.వి. అగ్రహారం శివారు లక్ష్మీపురం ఇటుకల బట్టీల్లో పనిచేస్తున్న మూడు కుటుంబాలుకు 50 కిలోల బియ్యం, వి.వి.అగ్రహారం గ్రామంలో 10 కుటుంబాల వలస కూలీలకు పది కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేసినట్టు తహసీల్దార్ తెలిపారు.

పంట నష్టం పరిశీలన



తామరంలో పంటను పరిశీలిస్తున్న అధికారులు

మాకవరపాలెం: తుపాను కారణంగా జరిగిన పంటనష్టంపై అధికారులు పరిశీలన ప్రారంభించారు. సుమారు వెయ్యి ఎకరాల్లో పంట నష్టం ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ఈ నేపథ్యంలో ఈ అంచనాలపై పరిశీలనకు అనకాపల్లి రైతు పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలతోపాటు శిక్షణ కేంద్రం అధికారులు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. శుక్రవారం తామరంలో రైతు శిక్షణ కేంద్రం అధికారులు టి.విజేత, తులసీమణి, ఏవో చిరంజీవి పర్యటించారు.

అన్నదాతలకు ల్యాబ్‌దాయకం

- ఆధునాతన వసతులతో వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్
- రూ.79 లక్షలతో నిర్మాణం
- అందుబాటులో విత్తన, ఎరువుల పరీక్షలు
- నకిలీల బెడద తప్పిందని రైతన్న హర్షం

పంట బాగుంటే దిగుబడులకు దిగులుండదు..పంట బాగుండాలంటే విత్తనం మంచిదవ్వాలి. అన్నదాతలకు అటువంటి విత్తనాలు, ఎరువులను సూచించే లక్ష్యంతో వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పైసా ఖర్చులేకుండా విత్తనాలను ముందే పరీక్షించుకోవడం ద్వారా నాసిరకం బారిన పడకుండా ధైర్యంగా సాగుచేస్తున్నామని రైతులు చెబుతున్నారు. మాడుగుల మండల కేంద్రంలో గల వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్ అన్నదాతలకు విశేష సేవలందిస్తూ వారికి అండగా నిలుస్తోంది. అలాగే పశువులకు సంక్రమించే వ్యాధులను గుర్తించడంలో కూడా ఈ ల్యాబ్ సహకరిస్తోంది.



మాడుగులలో వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్



పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ కుమారి

మాడుగుల: నియోజకవర్గ కేంద్రం మాడుగులలో రూ.79 లక్షలతో డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను అదునాతన పరిజ్ఞానంతో ఏర్పాటు చేశారు. ఈ ల్యాబ్ సేవలు ఈ ఏడాది జులై 8వ తేదీ నుంచి అందుబాటులోకి వచ్చాయి. ఇంతవరకు ఈ ల్యాబ్‌లో మొత్తం 6,300 పరీక్షలు నిర్వహించారు. విత్తన నాణ్యత పరీక్షలు జులై నుంచి ఇప్పటి వరకు 75 పరీక్షలు చేశారు.

ల్యాబ్‌లో అందిస్తున్న సేవలు

- విత్తనాల నాణ్యత, మొలకశాతం పరీక్షించడం
- ఎరువులు, పురుగు మందులు శాంపిల్స్ పరీక్షించి నాణ్యమైనవా? కావా? నిర్ధారించడం
- పశువుల పేడ, మూత్రం, ముక్కుద్రవాల పరీక్షలు
- పాల నాణ్యత పరీక్షలు, పాల దిగుబడి తగ్గిపోవడానికి కారణాలు తెలుసుకోవడం



ఇది కదా అభివృద్ధి

నియోజకవర్గంలో పశువుల సంఖ్య	
ఆవులు-	37,560
గేదెలు-	41,777
గొర్రెలు -	27,359
మేకలు -	36,182

నియోజకవర్గం - మాడుగుల	
రైతు భరోసా కేంద్రాలు	-78
పశు వైద్యశాలలు	-02
గ్రామీణ పశు వైద్యశాలలు	-04
వెటర్నరీ డిస్పెన్సరీలు	-11

ల్యాబ్‌లో నెలవారీగా నిర్వహించిన పరీక్షలు

పరీక్షలు	జులై	ఆగస్టు	సెప్టెంబర్	అక్టోబర్	నవంబర్
పేడ	131	99	124	257	646
రక్త	10	48	53	54	96
చర్మ వ్యాధులు	03	04	04	03	03
ముక్కుద్రవాలు	03	03	04	03	04
పాల పరీక్షలు	16	02	08	06	05
ఏవీఎస్టీ	03	07	01	03	06



వరి విత్తనాలు నాణ్యత పరీక్షలు నిర్వహిస్తున్న ల్యాబ్ సిబ్బంది

అందుబాటులోకి పశువైద్య పరీక్షలు



అగ్రి టెస్టింగ్ ల్యాబ్ అందుబాటులోకి రావడంతో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించి పశువులకు మెరుగైన వైద్యాన్ని సకాలంలో అందిస్తున్నాం. గ్రామాల్లో ఆర్‌బీకేలు, నియోజకవర్గ కేంద్రంలో అగ్రీ ల్యాబ్‌లు, పశు అంబులెన్స్‌లు రావడంతో సమాచారం అందిన వెంటనే పశువైద్యం అందిస్తున్నాం. పశువులకు సంక్రమించే సుమారు 12 రకాల వ్యాధులకు సంబంధించిన పరీక్షలు అందుబాటులో ఉన్నాయి.

–వి. చిట్టినాయుడు.
ప్రాంతీయ పశువైద్యశాఖ ఏడీ మాడుగుల

మరిన్ని సేవలు



ప్రైవేట్ డీలర్‌లు విక్రయిస్తున్న విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు శాంపిల్స్‌ను అగ్రి ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహిస్తున్నాం. అగ్రీ ల్యాబ్‌లు అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రైవేట్ డీలరులు జాగ్రతపడి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచుతున్నారు. ఎక్కడైనా కల్తీ విత్తనాలు, ఎరువులు, పురుగులు మందులు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వస్తే అగ్రీల్యాబ్‌లులో పరీక్షలు నిర్వహించి, చర్యలు తీసుకుంటాం. రానున్న కాలంలో రైతులకు మరిన్ని సేవలు అందుబాటులోకి రానున్నాయి.

– ఎం. వాసుదేవరావు. వ్యవసాయాధికారి. మాడుగుల.

తక్షణమే వ్యాధి నిర్ధారణ



గతంలో పశువులకు వ్యాధినిర్ధారణ పరీక్షలకు రూ.1,000 ఖర్చుపెట్టుకుని విశాఖ వెళ్లేవారం. త్వరగా రిపోర్టు రాకపోవడంతో వ్యాధ తీవ్రత పెరిగి పశువులు ఇబ్బందులు ఉండేవి. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అగ్రీ టెస్టింగ్ ల్యాబ్‌లో 15 నిమిషాల్లో పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ అనంతరం మందులు అందజేస్తున్నారు. ఒక్క రూపాయి ఖర్చులేకుండా పశువులకు వైద్యం అందుతోంది. – పత్రే చినబాబు, గాదిరాయి గ్రామం

నాణ్యమైన విత్తనాలు లభ్యం



గతంలో విత్తన నాణ్యత తెలుసుకోవాలంటే అనకాపల్లి వెళ్లవలసి వచ్చేది. ప్రస్తుతం ల్యాబ్ అందుబాటులోకి రావడంతో అగ్రీల్యాబ్‌లో మొలకశాతం కట్టించి విత్తనం వేస్తున్నాం. దీంతో దిగుబడులు బాగుంటున్నాయి ల్యాబ్ అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రైవేట్ వ్యాపారులు జాగ్రత్త పడి నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్నారు. ఆర్‌బీకేలు, అగ్రీ ల్యాబ్‌లు అందుబాటులోకి వచ్చిన తర్వాత విత్తనాల కల్తీ మాటలేదు. చాలా ఆనందంగా ఉంది.

–శనివాడ వెంకటరమణ, రైతు సత్యవరం

సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం

ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



పీపీ అగ్రహారంలో మాట్లాడుతున్న విప్ ధర్మశ్రీ



తట్టబంద గ్రామంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తున్న విప్ ధర్మశ్రీ

రావికమతం/బుచ్చెయ్యపేట: అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యత ఇస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో నిలిపిన జగన్‌మోహనరెడ్డి మళ్లీ సీఎం కావాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల్లో నిర్వహించి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. రావికమతం మండలం తట్టబందలో ముందుగా వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఆ గ్రామంలో ఇప్పటి వరకూ చేపట్టిన అభివృద్ధి డిస్‌ప్లే బోర్డు ద్వారా ఆవిష్కరించారు. అనంతరం కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులతో కలిసి పలు గృహాలను సందర్శించారు. మళ్లీ జగనే ఎందుకు సీఎం కావాలో వివరంగా తెలియజేశారు. జనంతో మమేకమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, ఎంపీటీసీ శేషుబాబు,చోడవరం మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ రాజాన నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట మండలం పీపీ అగ్రహారంలో నిర్వహించిన కార్యక్రమంలో ధర్మశ్రీ మాట్లాడుతూ గత టీడీపీ అవినీతి పాలనను, నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పరిపాలన విధానాన్ని చూసి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని కోరారు. తమ ప్రభుత్వ హయాంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని తెలిపారు. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగా కొండబాబు, సర్పంచ్ ఇందలి కోటేశ్వరరావు, నాయకులు కోరుకొండ అప్పలనాయుడు, గోపిశెట్టి శ్రీను, గొలజాన శ్రీను, ఇందలి శ్రీను,అప్పలనాయుడు తదితర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



వేచలంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న కర్రి సత్యం, బూరె బాబూరావు, శరారి నాయుడు



బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ జగన్‌మోహన్



సత్యవరంలో ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న రాజారామ్

దేవరాపల్లి/కె.కోటపాడు/మాడుగుల/రోలుగుంట: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని, పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్ రెడ్డి సీఎం కావాలని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు తెలిపారు. పలు గ్రామాల్లో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో వారు మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని చెప్పారు. దేవరాపల్లి మండలం వేచలంలో నిర్వహించిన కార్యక్రమంలో నాగిరెడ్డి శతారినాయుడు, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు పాల్గొన్నారు. రాత్రి పల్లె నిద్ర చేశారు. ఈ కార్యక్రమంలో ములకలాపల్లి పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి ఆర్‌వీకే నాయుడు, నాయుడు, ఎస్.జి.నగరం సర్పంచ్ చిరికి లక్ష్మి, వేచలం పాల సొసైటీ అధ్యక్షుడు వేచలపు కృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి. రమణ, కొరుపోలు శ్రీను, కర్రి కొండబాబు, వంటాకు సింహాద్రప్పడు, బత్తి నాయుడు, వేచలపు సూరిబాబు, ఎంఎల్‌వో అన్నం పవన్‌కుమార్ పాల్గొన్నారు.

- కె.కోటపాడు మండలం వి.సంతపాలెం గ్రామంలో శుక్రవారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, వైస్ ఎంపీపీలు లెక్కల నాగ విజయలక్ష్మి, రొంగలి సూర్యనారాయణ, సర్పంచ్ లెక్కల దేవీలత, దేముడునాయుడు, జేసీఎస్ కన్వీనర్ ఏటుకూరి రాజేష్, సర్పంచ్‌లు వేచలపు దొరబాబు, గొంప్రుపోటు వెంకటరావు, చీపురపల్లి అచ్చిబాబు, దొగ్గ ఉమాశంకర్, ఆకుల సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.
- మాడుగుల మండలం సత్యవరం గ్రామంలో ఎంపీటీసీ తలారి అప్పారావు, సర్పంచ్ జెర్రిపోతల నాగమణి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పల్లెకు పోదాం కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తాళ్ళపురెడ్డి వెంకట రాజారామ్ సంక్షేమ క్యాలెండర్, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు, వైఎస్సార్‌సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఇందుకూరి నాగరాజు, సచివాలయ కన్వీనర్ తలారి కొండతల్లి, వైఎస్సార్‌సీపీ నాయకులు కాళ్ళరాజు, గోకెడ అప్పల నాయుడు, జనపరెడ్డి అప్పారావు, శనివాడ సూర్యనారాయణ,గోకెడ ఈశ్వరరావు,గోకెడ రమణ పాల్గొన్నారు.
- రోలుగుంట మండలం కె.నాయుడుపాలెంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ గుములూరి బాబులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లె నిద్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గుములూరి శ్రీను, అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదమ్మ,సంతోషిమాతను దర్శించుకున్న 'దాడి'



మోదకొండమ్మను దర్శించుకుంటున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు

మాడుగుల/మాడుగుల రూరల్: మండల కేంద్రం మాడుగులలో మోదకొండమ్మను, కె.జె.పురం జంక్షన్‌లో గల సంతోషిమాత అమ్మవారిని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీర భద్రరావు శుక్రవారం దర్శించుకున్నారు. ఆయా ఆలయ కమిటీలు వీరభద్రరావుకు ఘన స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు చేయించారు. ఈ కార్యక్రమాల్లో సంతోషి మాత ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమ్మతల్లి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సాధికార బస్సు యాత్రకు ముమ్మర ఏర్పాట్లు

రోలుగుంట: వడ్డాదిలో నిర్వహించనున్న వైఎస్సార్ సీపీ సామాజికసాధికార బస్సు యాత్రకోసం ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. మండలస్థాయిలో కార్యకర్తలు, మండల నాయకులతో ఇటీవల సమావేశం నిర్వహించి, ఏర్పాట్లపై చర్చించారు. రోలుగుంట మండల శివారు వెలంకాయపాలెం నుంచి నియోజకవర్గంలో యాత్ర ప్రారంభమవుతుంది. ఈ మేరకు అక్కడ మంత్రులకు స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రోలుగుంటలో వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని రంగులతో తీర్చిదిద్దారు. మండలం నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులను తరలించేందుకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని శుక్రవారం ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొర్లె వెంకటరామన్, జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ విలేకరులకు తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

రోలుగుంట: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కాళింగ సతీష తెలిపారు. ఇటీవల అనకాపల్లిలో జరిగిన జిల్లాస్థాయి యూటీఎఫ్ ఎన్నికల్లో జగ్గంపేట పాఠశాల ఉపాధ్యాయుడు సతీష్ జిల్లా కార్యదర్శిగా ఎంపిక య్యారు. మండలంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు ఆయనను శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు పదవిరావడానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవానికి ఆహ్వానం

రోలుగుంట: అయోధ్య లో రామమందిరం నిర్మాణం పూర్తయింది. దీంతో ఆ మందిరం నిర్వాహకులు వచ్చే ఏడాది జనవరి 22న ప్రారంభోత్సవం చేయాలని నిర్ణయించారు. పెద్ద ఎత్తున భక్తులను ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా మండలాలు, గ్రామస్థాయిలో కూడా ఆహ్వానం పలికేందుకు సేవా సంఘాల బృందాలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు నర్సీపట్నం ఏరియాకు నిర్ణయించిన రాయిపురెడ్డి శ్రీనివాసరావు బృందం శుక్రవారం బుచ్చింపేట, వడ్డిప మీదుగా రాత్రికి రోలుగుంట చేరుకుంది. గ్రామంలో పలువురిని కలసి అక్షితలిచ్చి ఆహ్వానించింది. స్థానిక జీవకారుణ్య సంఘం, శ్రీసిద్ధి వినాయక సంఘం సభ్యులను కలసి తమ వంతుగా ఈ కార్యక్రమ విజయానికి సాయపడాలని ఆ బృందం కోరింది. బృంద ప్రతినిధి శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ పాదయాత్రకు భక్తుల్లో మంచి స్పందన లభిస్తోందన్నారు.

ప్రకృతిసాగు విధానంతో పంట సురక్షితం

చీడికాడ: రసాయనాలు ఉపయోగించి సాగుచేసిన వరి పంట తుపాను ధాటికి నేలకొరిగిందని, ప్రకృతి విధానంలో సాగు చేసిన వరిపైరు ఎక్కడా నేలకొరగలేదని ఎన్‌పీఎం జిల్లా డీపీఎం సీహెచ్ లచ్చన్న తెలిపారు. మండలంలోని పలుగ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విచ్చలవిడిగా రసాయనాలు వినియోగించడం వల్ల వేరు వ్యవస్థ బలపడలేదని, అందువల్లే ఎక్కువ శాతం వరి చేను నేలకొరిగిందని రైతులకు వివరించారు.

సామాజిక సాధికార యాత్ర విజయవంతానికి కృషి

– ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



రావికమతంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ధర్మశ్రీ

రావికమతం: నియోజకవర్గంలో నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సుయాత్ర విజయవంతం చేయడమే ధ్యేయంగా అందరూ పనిచేయాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. ఇక్కడ శుక్రవారం నిర్వహించిన పార్టీ ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన రెడ్డి హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చేకూరిన లబ్ధిని వివరించేందుకు మూడవ విడతగా చోడవరం నియోజకవర్గంలో రోలుగుంట నుంచి ఈ యాత్ర ప్రారంభమవుతుందన్నారు. వడ్డాదిలో బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. ఈ యాత్రలో 50 వేల మందికి పైగా పాల్గొనేలా అందరూ కృషి చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీపీ పైల రాజు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్మడు సత్యదేవ, మాజీ జెడ్పీటీసీ ఆశరి వాసుగోవిందరావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గంటా ఈశ్వరరావు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బంటు సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ మండలశాఖ కార్యదర్శిశీలంశంకరరావు పాల్గొన్నా రు.

సంక్షేమం, అభివృద్ధిపై విస్తృత ప్రచారం

చోడవరం: పట్టణంలో అన్ని వార్డుల్లో పర్యటించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సూచించారు. చోడవరం పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ వార్డు మెంబర్లు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, కన్వీనర్లతో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. పంచాయతీ పరిధిలో ఉన్న ఐదు సచివాలయాల పరిధిలో వార్డుల వారీగా పంచాయతీ వార్డు మెంబర్లు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, కన్వీనర్ల కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈనెల 15లోగా అన్ని వార్డుల్లో పర్యటించి ప్రచారం చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నారాయణరావు, సర్పంచ్ బండి నూకాలమ్మ శ్రీను, ఉపసర్పంచ్ పుల్లేటి వెంకటరావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఒరుగంటి నెహ్రూ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీచైర్మన్ జ్యోతుల రమేష్, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులందరికీ పరిహారం

మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జగన్నాథరావు



మాట్లాడుతున్న జగన్నాథరావు

రావికమతం: తుపాను వర్షాలకు నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కంచిపాటి జగన్నాథరావు తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. చిట్టచివరి రైతుకూ పరిహారం అందించాలన్నారు. తడిసిన ధాన్యాన్ని ఎలా బాగుచేయాలో రైతులకు వివరంగా తెలపాలన్నారు. తుపాను అనంతరం వేసుకోవాల్సిన పంటల గురించి తెలియజేయాలని సూచించారు. 1,200 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు ప్రాథమిక నివేదిక వచ్చిందని ఇంకా గ్రామాలలో పర్యటించి నష్టపోయిన రైతులను గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ మహేశ్వరరావు,ఎంపీడీవో వెంకన్నబాబు, వ్యవసాయాధికారి రూప పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన



ఈవీఎంను పరిశీలిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వినియోగంపై తహసీల్దార్ కార్యాలయంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో హెచ్.వి.జయరాం మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎంల వినియోగం పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం తహసీల్దార్ అన్నాజీరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.